నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం 19 జూన్ 2023

పార్టీ కోసం పాటు పడేవారికే గుర్తింపు

- జడ్పీ ఫోరం లీడర్ అంబర్ సింగ్

నవతెలంగాణ-వర్ని

బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రధాన పాత్ర పోషించిన ఎన్రోలర్స్ సేవలను గుర్తించి నియోజకవర్గంలోని ప్రతి ఒక్క ఎన్రోలర్‌లను మరింత ప్రోత్సాహంతో పనిచేయడానికి ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున నగదును అందిస్తూ కార్యకర్తను బలపరస్తున్నామని జడ్పీటీసీ అంబర్‌సింగ్ అన్నారు. వర్ని మండలంలో కాంగ్రెస్ కార్యకర్తలకు రూ.1,10,000 నగదును అందజేశారు. ఈ సందర్భంగా అంబర్ సింగ్ మాట్లాడుతూ ఈసారి బాన్సువాడ గడ్డ మీద కాంగ్రెస్ జెండా ఎగిరేసే విధంగా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వర్ని మండల అధ్యక్షులు సురేష్ బాబా, వైస్ ఎంపీపీ దశగౌడ్, చందూర్ మండల అధ్యక్షులు పోతరాజు శ్రీనివాస్, గుర్ల మల్లయ్య, ప్రకాష్ బాబా, కృష్ణరెడ్డి, మారుతిసేట్, నారెడ్ల సాయిలు, షెలి నాయక్, నారాగౌడ్, జీవన్, అశోక్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పల్లెపల్లెకూ కాంగ్రెస్



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని సబ్దల్‌పూర్, దావల్ మల్కాపల్లి, మత్తమాల గ్రామాల్లో టీపీసీసీ ఉపాధ్యక్షులు మదన్ మోహన్ ఆధ్వర్యంలో పల్లెపల్లెకూ కాంగ్రెస్ గడప గడపకూ మదన్ అన్న (హాథ్ సే హాథ్ జోడో) కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా మదన్ మోహన్ గడపగడపకూ తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు పరిచే కార్యక్రమాలు గురించి గ్రామస్థులకు వివరించారు.

ఉత్తమ పంచాయతీలకు


నగదు ప్రోత్సాహమేది?

- నిజామాబాద్‌లో 27 పంచాయతీలు ఎంపిక
- ఒక్కో పంచాయతీకి 10 లక్షలిస్తామన్న సర్కారు
- నిధులు లేక నీరసించిన పంచాయతీలు

గ్రామ పరిపాలనలో ఉత్తమ పనితీరు కనబరిచిన పంచాయతీలకు నగదు ప్రోత్సాహం ఉత్తమాటగా మిగిలింది. నిజామాబాద్ జిల్లాలో 9 కేటగిరీలో మొత్తం 27 పంచాయతీలు ఉత్తమ పంచాయతీలుగా ఎంపికయ్యాయి. ఒక్కో పంచాయతీకి రూ.10 లక్షలు రావాల్సి ఉన్నప్పటికీ.. నిధులు విడుదల కావడం లేదు. ఉత్తమ పంచాయతీలకు అవార్డుల ప్రదానం జరిగింది కానీ ప్రోత్సాహం రాలేదు. ప్రోత్సాహం కోసం సర్పంచులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం పంచాయతీలు నిధులు లేక నిరసించాయి. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల ఊసేలేదు. చివరకు పంచాయతీ కార్మికులకు వేతనాలు సైతం చెల్లించే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ఈ నగదు ప్రోత్సాహంతోనైనా కొంత ఊరట కలుగుతుందని సర్పంచులు భావిస్తున్నారు.

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఈ ఏడాది ఉత్తమ పంచాయతీల ఎంపికలో తొమ్మిది కేటగిరీ(థీమ్)లను కేంద్రం ప్రవేశపెట్టింది. తొమ్మిది విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉన్న పంచాయతీలను కేంద్ర ప్రభుత్వం సూచించిన ప్రమాణాల ఆధారంగా ఎంపిక చేశారు. ప్రతి దశలోనూ ప్రత్యేక బృందాలు తనిఖీలు చేసి, సమగ్ర పరిశీలన జరిపి అవార్డులకు ఎంపిక చేశారు. అయితే కేంద్రం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా నిజామాబాద్ జిల్లాలో మొత్తం 27 పంచాయతీలు ఎంపికయ్యాయి. ఈ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక్కో పంచాయతీకి రూ.10 లక్షల చొప్పున ప్రోత్సాహక నగదు అందజేస్తామని మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రకటించారు. ప్రకటించి మూడు నెలలు పూర్తవుతున్నా ఇప్పటికీ నగదు అందలేదని సర్పంచులు వాపోతున్నారు. సుపరిపాలన, ఆరోగ్య పంచాయతీ, స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాల కల్పన, నీటి సమృద్ధి, పేదరికంలేని మెరుగైన జీవనం, పిల్లల స్నేహపూర్వక, మహిళా స్నేహపూర్వక పంచాయతీ, సామాజిక భద్రత తదితర కేటగిరిలో పంచాయతీలను ఎంపిక చేశారు. జిల్లాలో పేదరిక రహిత-మెరుగైన జీవనోపాధిలో డిచ్‌పల్లి మండలం బీబీపూర్ పంచాయతీ మొదటిస్థానంలో ఎంపికయ్యింది. ఆరోగ్య పంచాయతీలో దేగాం గ్రామం, నీటి సమృద్ధిలో సోంపూర్, హరిత, శుభ్రమైన పంచాయతీలో ఆర్గుల్ పంచాయతీలు ఎంపికయ్యాయి. ఈ విధంగా మొత్తం 9 కేటగిరిలో 27 పంచాయతీలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎంపికయ్యాయి. ఈ పంచాయతీలకు ఒక్కో పంచాయతీకు రూ.10 లక్షల చొప్పున మొత్తం 2 కోట్లా 70 లక్షల నగదు ప్రోత్సాహం లభించాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు పైసా రాలేదు.



ప్రోత్సాహం కోసం ఎదురుచూస్తున్నాం

ఉత్తమ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల నగదు ప్రోత్సాహం అందజేస్తామని ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు నిధులు రాలేదు. నిధుల కోసం ఎదురుచూస్తున్నాం. ప్రస్తుతం పంచాయతీల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి నిధులు రావడం లేదు. పంచాయతీల్లో కార్మికులకు వేతనాలు చెల్లించేందుకు అప్పులు చేస్తున్నాం. కనీసం ఈ నగదు ప్రోత్సాహమైనా లభిస్తే కొంత ఉపశమనం లభిస్తుంది.

ముస్కు సాయారెడ్డి
(మునిపల్లి సర్పంచ్. జక్రాన్‌పల్లి మండలం)

జేఈఈలో గిరిజన గురుకుల విద్యార్థి ప్రతిభ



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో గిరిజన గురుకుల విద్యార్థిని ప్రతిభ చాటినట్టు ప్రిన్సిపాల్ వాణి తెలిపారు. ఎల్లారెడ్డి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మాలోతు సుష్మిత ఆలిండియా ర్యాంకింగ్‌లో 423 స్థానం దక్కించుకుందని అన్నారు. విద్యార్థిని సుష్మితను జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వాణి, కళాశాల అధ్యాపకులు అభినందించారు. ప్రిన్సిపల్, కళాశాల అధ్యాపకులను రీజినల్ కోఆర్డినేటర్ టి.సంపత్ కుమార్ అభినందించారు.

పలకరించని తొలకరి

తొలకరి పలకరించలేదు. వానాకాలం సీజన్ ప్రారంభమై 20 రోజులు సమీపిస్తున్నా.. ఇప్పటివరకు తొలకరి జల్లులు పడిన దాఖలాలు లేవు. ఆరుతడి పంటలు సాగు చేసే రైతులు పంట భూములను దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు సిద్ధం చేశారు. కానీ వర్షాలు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

- జాడలేని నైరుతి రుతుపవనాలు
- తడి లేక మొదలుకాని ఆరుతడి సాగు
- వరుణుడి కోసం రైతుల ఎదురుచూపులు
- జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ముందస్తు ప్రణాళిక వెనక్కి


దుక్కి దున్ని భూమి సిద్ధం చేసిన రైతులు

నవతెలంగాణ-లింగంపేట్

గత సంవత్సరం జూన్ మొదటి వారంలోనే వర్షాలు కురవడంతో వాగుల్లో నీరు చేరింది. ఈ నెల మొదటి వారంలోనే నైరుతి రుతుపవనాలు జిల్లాకు రావాల్సి ఉండగా.. రెండో వారం పూర్తయినా ఉష్ణోగ్రత పెరగడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో సోయా, పత్తి, మొక్కజొన్న, పప్పు దినుసులు అంతర పంటలు వేసే రైతులు భూములను సాగు చేసి సిద్ధంగా ఉంచి.. ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. మే నెలలో ఉండే ఎండల తీవ్రత.. జూన్ రెండో వారంలో సైతం ఉండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

జాడ లేని నైరుతి రుతుపవనాలు..

సాధారణంగా తొలకరి వర్షాలు కురిస్తే జూన్ మొదటి వారం నుంచి జిల్లాలో ఆరుతడి మెట్ట పంటల సాగు ఆరంభమవుతుంది. కానీ ఈ ఏడాది జూన్ రెండో వారం పూర్తి అవుతున్నా చినుకు జాడ లేకపోగా మరో వారం రోజుల వరకు వర్షాలు కురిసే అవకాశాలు లేవని వాతావరణ శాఖ అంచనా వేయడంతో రైతుల తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మే నెల చివరి వారంలో కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేశారు. ముఖ్యంగా ఆరుతడి పంటలు సాగు చేసే సదాశివనగర్, గాంధారి, తాడ్వాయి, పిట్లం, రాజంపేట్, పెద్దకొడప్‌గల్, జుక్కల్, మద్నూర్ మండలాల్లో మొక్కజొన్న, సోయా, పత్తి, పెసర, కంది, మినుము, అంతర్ పంటలు వేయడానికి భూములు చదును చేశారు. పిట్లం, జుక్కల్, మద్నూర్ ప్రాంతంలోని రైతులు కొంతమంది పత్తి, పెసర, మినుము విత్తనాలు వేశారు. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసి సాగుకు సిద్ధంగా ఉన్నారు. అదేవిధంగా ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, లింగంపేట్, నిజాంసాగర్, మాచారెడ్డి, రామారెడ్డి మండలాల్లో వరి పంటల సాగు చేసే రైతులు బోరు బావుల వద్ద తుకం వేసేందుకుగానూ నారుమల్లు సిద్ధం చేసేందుకు దుక్కులు దున్ని సిద్ధంగా ఉంచారు. కానీ రోజురోజుకు ఎండలు తీవ్రంగా కావడంతో 42 డిగ్రీల పైన ఉష్ణోగ్రత నమోదు కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ముందస్తు లేనట్టే.. ప్రణాళిక వెనక్కి

అకాల వర్షాల నుంచి పంటలు రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ముందస్తు సాగు విధానాన్ని ప్రవేశపెట్టింది. అకాల వర్షాలు, ఈదురు గాలులు, వడగండ్ల వాన కారణంగా రైతుల పంట నష్టం జరగకుండా వరి, ఇతర పంటల సాగు ముందుకు తీసుకొచ్చేలా గ్రామ గ్రామానా రైతులకు అవగాహన కల్పించారు. ఏయే ప్రాంతాల్లో ఏయే పంటలు సాగు అవుతాయో ముందస్తుగా సాగు చేసేందుకు రైతులను సిద్ధం చేశారు. ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో ముందస్తు పంటల కాలానికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించగా ఫలితం లేకుండా పోయింది.

అనారోగ్యంతో ఆశ కార్యకర్త మృతి

- ఆశా కార్యకర్త పాడే మోసిన సీఐటీయూ నాయకుడు
- అంత్యక్రియలకు రూ.10వేలు ఆర్థికసాయం


పాడెమోస్తున్న సురేష్‌గొండ

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని చిన్నఎడ్గి గ్రామ ఆశాకార్యకర్త సునీత గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం చనిపోవడంతో చిన్నఎడ్గిలో అంత్యక్రియలు నిర్వహించారు. సీఐటీయూ నాయకులు సురేష్ గొండ అంత్యక్రియలో పాల్గొని కుటుంబీకులను పరామర్శించి అంత్యక్రియలలో పాడె మోశారు. అంత్యక్రియ ఖర్చులకు రూ.10వేలు నగదును ఆశాకార్యకర్తలతో కలిసి అందజేశారు. కరోనా సమయంలో ప్రాణాలు లెక్కచేయకుండా విధులు నిర్వహించారని, ప్రభుత్వం ఎటువంటి సహాయం అందించకుండా కేవలం పొగడ్తలతో సంతోష పర్చుతున్నారని, మరణించిన ఆశాకర్యకర్తల కుటుంబాలను ఆదుకోవాలని తెలిపారు. అంత్యక్రియల్లో ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సాయి హాస్పిటల్ ప్రారంభోత్సవం సందర్భంగా శ్రీసాయి హాస్పిటల్ యాజమాన్యం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు ఉచిత వైద్య సేవలతోపాటు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్లు జయప్రకాశ్ సింగ్ జాదవ్, బానోత్ కల్పన మాట్లాడుతూ.. శ్రీ సాయి హాస్పిటల్లో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని వారు తెలిపారు.

స్వచ్ఛమైన నీటితో ఆరోగ్యం

- ఆహారంలో మార్పుకు రైతు సహకారం ఉండాలి
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి


వర్ని : మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-వర్ని

స్వచ్ఛమైన నీటితో ఆరోగ్యంగా ఉంటామని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రపంచంలో మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి పరమైన నీరు, గాలి, ఆహారం ప్రదానమని స్పీకర్ చెప్పారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం చందూర్ మండల కేంద్రంలో మంచి నీళ్ల పండగ కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఈ రోజుల్లో ప్రజలు నిత్యం అనారోగ్య సమస్యలతో డబ్బులు ఖర్చు చేసుకుంటూ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారంటే అది స్వచ్ఛమైన నీరు తాగకపోవటమే కారణమని తెలిపారు. హైదరాబాద్‌లో ఒక్క ఆసుపత్రి ఉన్నవాళ్లు నేడు రెండు, మూడు నడుపుతున్నారని తెలిపారు. విషపూరిత, కలుషితమైన నీటితో మనిషికి కిడ్నీ సమస్యలు, మోకాళ్ళ నొప్పులు వస్తాయని తెలిపారు. చిన్నప్పుడు తన ఊరిలో చెలిమల నీళ్లు తాగితే ఏ జబ్బులు లేవని, కానీ ఇప్పుడు బోర్ల నీళ్ల తాగి, ఫిల్టర్ నీరు తాగితే మోకాళ్ళ నొప్పులు, కిడ్నీలు పాడవుతున్నాయని అన్నారు. మనిషి తాగే నీటిలో 250 నుంచి 300 రకాల ఖనిజ లవణాలు ఉంటే ఆరోగ్యానికి మంచిదన్నారు. అన్ని రకాల నీటిని పరిశీలిస్తే మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న నీరు మాత్రమే స్వచ్ఛమైనదని నిర్ధారణ అయిందన్నారు. వర్షపు నీటిని నదుల నుంచి సేకరించి, శుద్ధ చేసి, ఖనిజ లవణాలు కలిగేలా నీటిని తయారు చేసి ప్రజలకు ఇంటింటికి సరఫరా చేస్తున్నదే మిషన్ భగీరథ నీరు అని తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గంలో మిషన్ భగీరధ ద్వారా నీటి సరఫరా కోసం రూ.500ల కోట్లు ఖర్చు చేసి 70వేల కుటుంబాలకు మంచి నీటిని అందిస్తున్నామని తెలిపారు. మనిషికి రోజుకు 100 లీటర్ల చొప్పున నీరు సరఫరా చేస్తున్నట్టు వివరించారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించడానికి ఒక్కో కుటుంబానికి సుమారు 65,000 రూపాయలు ఖర్చు అయిందని చెప్పారు. కార్యక్రమంలో బోధన్ ఆర్‌డీఓ రాజేశ్వర్, బాన్సువాడ ఇంచార్జి పోచారం సురేందర్‌రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ, ఏఎంసీ చైర్మన్ మూడు కవిత అంబర్ సింగ్, సర్పంచులు కర్లం సాయరెడ్డి, సత్యానారాయణ, రవి, దేవి సింగ్, దాసరి గంగారాం, పీఏసీఎస్ చైర్మన్ ప్యారం అశోక్, తారాచందు, ఉపసర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, మాజీ చైర్మన్ మాధవరెడ్డి, సీనియర్ నాయకులు అరికెల సాయరెడ్డి, దుర్కి పోశెట్టి, ఎంపీటీసీ శ్యాంరావ్, మాజీ ఎంపీటీసీ జ్యోతి సాయిలు, నర్సింలు, రాంరెడ్డి, ఎంపీడీఓ నీలవతి, తహసీల్దార్ వసంత, ఎంపీవో తారచంద్, సెక్రటరీ సాయిలు, ముజ్జు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఘన్‌పూర్‌లో నీటి కొరత ఉంది సార్..

మంచినీళ్ల పండగ సభలో చందూర్ మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన ఓ మహిళా స్పీకర్ మిషన్ భగీరథ నీటిపై మాట్లాడుతుండగా సభలో లేచి 'సార్ మా గ్రామానికి మంచి నీటి సమస్య ఉంది' అని తెలిపింది. దీంతో స్పీకర్ సభలో అరవకూడదు అని తెలపడంతో పాటు స్థానిక నాయకులు మెప్పించడంతో మహిళా శాంతించింది. సభ ముగింపు తరువాత ఆ గ్రామ మహిళలు సర్పంచ్‌ను మిషన్ భగీరథ నీరు రావడం లేదని నిలదీశారు.

మద్నూర్ : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ హయంలో రాష్ట్రం అభివృద్ధి చెందిందని జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతు షిండే తెలిపారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జుక్కల్ నియోజకవర్గం స్థాయి మంచినీళ్ల పండుగను మద్నూర్ మండలంలోని శాఖాపూర్ గ్రామంలో నిర్వహించారు. ఎమ్మెల్యేకు శాఖాపూర్ సర్పంచ్ ఎంకే పటేల్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీబాయి, డీసీసీబీ డైరెక్టర్ రామ్ పటేల్, ఆత్మ కమిటీ చైర్మన్ కొండ గంగాధర్, బీఆర్ఎస్ మద్నూర్ మండల పార్టీ అధ్యక్షులు బన్సీ పటేల్, డోంగ్లి మండల పార్టీ అధ్యక్షులు శశాంక్ పాటిల్, సర్పంచుల సంఘం మండలాధ్యక్షులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.


మద్నూర్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే

లింగంపేట్ : మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్ల పండుగ నిర్వహించారు. మిషన్ భగీరథ ట్యాంక్ వద్ద వాటర్ మెన్‌లకు శాలువా కప్పి మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీపీ మాధవి బలరాజ్‌గౌడ్ తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న మంచి నీళ్ల పండుగ కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నాసాగర్ గ్రామంలో పాల్గొని ఉత్తమ వాటర్ మెన్‌లకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉష గౌడ్, సర్పంచ్ నాగరాజు, ఎంపిటీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని కామారెడ్డి జిల్లాలోని మల్లన్న గుట్ట సమీపంలో ఉన్న మిషన్ భగీరథ ప్రాజెక్టు వద్ద తెలంగాణ మంచినీళ్ల పండగ సంబరాలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ హాజరై మాట్లాడారు. మిషన్ భగీరథ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో, జిల్లాలో మంచినీటి ఎద్దడిని శాశ్వతంగా తీర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. గ్రామాల్లోని ప్రజలు సురక్షితమైన నీటిని తాగడం వల్ల వ్యాధులు రావడం లేదని తెలిపారు. గతంలో తెలంగాణ రాకముందు తాను ఏ గ్రామానికి వెళ్లినా మహిళలు రోడ్డుకు అడ్డంగా బిందెలు పెట్టి నీటి ఎద్దడిని తీర్చాలని ఆందోళన చేపట్టే వారని చెప్పారు. కొట్లాడి తెచ్చిన తెలంగాణలో నీటి కోసం మహిళలు ఇబ్బందులు పడవద్దని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచించి ఇంటింటికి మంచినీటిని అందించారని పేర్కొన్నారు. సమావేశంలో జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్ షిండే, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లక్ష్మీనారాయణ, ఎంపీపీ గైని అనసూయ, జడ్పీ వైస్‌చైర్మన్ ప్రేమ్ కుమార్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మొహినుద్దీన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి : మండలంలోని రామారెడ్డి, మద్దికుంట, రెడ్డిపేట్, అన్నారం, సింగరాయపల్లి, గొల్లపల్లి, కన్నాపూర్, కన్నాపూర్ తాండా, పోసానిపేట్, గోకుల్‌తండా, ఉప్పల్‌వాయితో పాటు ఇసన్నపల్లి, మోషన్‌పూర్, రంగంపేట్ గ్రామాల్లో నీటి పండుగ సందర్భంగా మిషన్ భగీరథ నీటిని మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు హక్కుల పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి

- సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ పిలుపు



మాట్లాడుతున్న మోతిరాంనాయక్

నవతెలంగాణ-గాంధారి

కార్మికులు హక్కుల పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గాంధారి మండలంలో జరిగిన సీఐటీయూ మండల మహాసభ జరిగింది. ఈ సమావేశానికి సీఐటీయూ జిల్లా నాయకులు వెంకట్ గౌడ్, రవీందర్, మోతీరాంలు హాజరై మాట్లాడుతూ.. కార్మికులు పోరాటాలు నిర్వహించి అనేక చట్టాలను సాధించుకున్నారని, అలాంటి చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసి కార్మికుల హక్కులను కాలరాస్తున్నారన్నారు. కార్మిక హక్కుల సాధనకై సాధించుకున్న చట్టాలను రక్షణకై కార్మికవర్గం పోరాటాలకు సిద్ధం కావాలని, ఈ పోరాటాలకు సీఐటీయూ అండదండలు ఉంటాయని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మణెమ్మ, ప్రకాష్, శ్రీలత, రోజా, సవిత, లక్ష్మి నారాయణ, రాజు, సాయిలు, రాములు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సాధనలో ముందుండి పోరాడిన గౌడన్నలకు అన్యాయం


మాట్లాడుతున్న లింగాగౌడ్

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ రాష్ట్ర సాధనలో ముందుండి పోరాడిన గౌడన్నలకు బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందని జై గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు బొంబోతుల లింగాగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ కులవృత్తుల వారికి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేస్తానన్న బీఆర్ఎస్ ప్రభుత్వం గౌడ కులస్తులను విస్మరించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలలో కవితక్కకు పట్టిన గతే బీఆర్ఎస్ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతి నియోజకవర్గ నుంచి 100 మంది గీత కార్మికులు పోటీకి దిగి నిరసన తెలుపుతామని హెచ్చరించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో నేటి మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పొన్నం ప్రభాకర్‌గౌడ్, మధుయాష్కిగౌడ్, స్వామి గౌడ్, బూర నర్సయ్య గౌడ్, వంటి గౌడ సంఘం నాయకుల పోరాట ఫలితమని మర్చిపోవద్దన్నారు. కార్యక్రమంలో జై గౌడ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాంగోళ్ల మురళి గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు బండారి సాయిరాం గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్‌గౌడ్, కార్యదర్శి మొగుళ్ళ రామాగౌడ్, ఇందూరి సిద్దాగౌడ్, అంకన్నగారి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

22న 'అమర వీరుల సంస్మరణ' సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జిల్లా ప్రజా పరిషత్ నిజామాబాద్, ప్రత్యేక సర్వ సభ్య సమావేశం "అమర వీరుల సంస్మరణ" కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జెడ్పీ సీఈవో గోవింద్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్, నిజామాబాద్‌లో ప్రత్యేక సర్వ సభ్య సమావేశం జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు అధ్యక్షతన, 'అమర వీరుల సంస్మరణ' కార్యక్రమం ఈనెల 22న గురువారం ఉదయం 11 గంటలకు జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. సమావేశానికి సకాలములో హాజరు కాగలరని కోరారు.

డబ్బులు రికవరీ చేసి టీయూ అభివృద్ధికి వాడాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రెండు సంవత్సరాలుగా తెలంగాణ విశ్వవిద్యాలయంలో వీసీ ప్రజాధనాన్ని ఖాజేశారని, ఆ డబ్బుల్ని రికవరీ చేసి యూనివర్సిటీ అభివృద్ధికి వాడాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. నగరంలోని ద్వారకానగర్ ఇఫ్టు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీ వీసీ 50 వేలు లంచం తీసుకుంటున్న సందర్భంలో ఏసీబీ అధికారులు పట్టుకోవడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. యూనివర్సిటీలో వీసీ అవినీతికి సహకరించిన వారందరినీ విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పాలక మండలి సమావేశలలో తీసుకున్న తీర్మానాలను అమలు చేయాలని, యూనివర్సిటీలో సమస్యలు పరిష్కరించాలని, బోధనను గాడిలో పెట్టాలని తెలిపారు. సమావేశంలో మనోజ్, విజయ్, రంజిత్, గంగాధర్. తదితరులు పాల్గొన్నారు.

చికెన్ @ 340



- తినాలంటే జంకుతున్న మాంసం ప్రియులు
- ఆల్ టైం రికార్డ్ ధర
- బోటీకి పెరిగిన డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కోడి మాంసంతో భోజనాన్ని లొట్టలేసుకుని ఆరగించే మాంసాహార ప్రియులకు చికెన్ ధరలు మింగుడుపడడం లేదు. ప్రస్తుతం కోడి ధర కొండెక్కి కూర్చుంది. ఎండలు మండిపోతుండడంతో చికెన్ తినే వారి సంఖ్య తగ్గుతుంది. చికెన్‌కు అంతగా డిమాండ్ ఉండదులే అనుకుంటే పొరపాటే. రాష్ట్ర వ్యాప్తంగా చికెన్ ధరలు భగ్గుమంటున్నాయి. కిలో స్కిన్‌లెస్ చికెన్ ధర రూ.320 నుండి 340 పలుకుతుండడంతో కోడి మాంసం ప్రియులు అవాక్కవుతున్నారు. 15 రోజుల కిందటి వరకు కిలో చికెన్ రూ.220 నుంచి రూ.240 ఉండగా ఇప్పుడు అది స్కిన్ లెస్ కిలో రూ.340 నుండి 360, విత్ స్కిన్ రూ.320 నుండి 340కి చేరింది. దీంతో ఈ వేసవి చికెన్ ప్రియులకు షాకిస్తోంది. మార్కెట్‌లో ప్రస్తుతం లైవ్‌బర్డ్ కిలో రూ.180కి విక్రయిస్తున్నారు. అంతకు ముందు ఈ ధర రూ.120గా ఉండేది. ఏప్రిల్ 1నకిలో చికెన్ ధరరూ. 154గా ఉంది. వారం కిందట మార్కెట్‌లో స్కిన్‌తో కూడిన చికెన్ ధర కిలో రూ.213గా, స్కిన్‌లెస్ రూ.243గా ఉండేది. ఇప్పుడు ఆధర రూ.340కు చేరింది. మటన్ ధరతో పోలిస్తే ఆ ధరలో అర్ధ కిలో మటన్ ధరకే కిలో చికెన్ వస్తుండడంతో మాంసాహారులు ఎక్కువగా చికెన్ తినేందుకే ఇష్టపడతారు. అయితే చికెన్ ధరలు పెరగడంతో కొనేందుకు వెనకాముందు ఆలోచించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇక ఇంటికి బంధువులు వస్తే చికెన్ కొనాలంటే రూ.వెయ్యి దాకా ఖర్చు చేయాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. వేసవిలో విపరీతమైన ఎండలకు బయటకు వెళ్లాలంటేనే మనుషులు కూడా భయపడుతున్నారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజూ దాదాపు 45 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో కోళ్లు ఎండ వేడికి ప్రాణాలు వదులుతున్నాయి. అందుకే కోళ్ల ఫారాలలో కోళ్లను పెంచడానికి యజమానులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా వేసవి కాలంలో కోళ్లఫారాల్లో చికెన్ బ్యాచ్‌లను పెంపకందారులు తగ్గిస్తుంటారు. అదేసమయంలో ఎండలు విపరీతంగా పెరగడంతోపాటు వడగాలులకు కోళ్లు మృత్యువాత పడుతుండడంతో చికెన్ ధరలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. గత సంవత్సరం కూడా ఎండలు తీవ్రంగా ఉండడంతో చికెన్ ధరలు ఇదేవిధంగా రోజురోజుకు పెరిగాయి. అదే తీరు ఈ సంవత్సరం కూడా నెలకొందని చికెన్ దుకాణ్ దారులు చెబుతున్నారు. సాధారణంగా వేసవిలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత దాటితే బాయిలర్ కోళ్లు ఎండవేడిని తట్టుకోలేవు. కోళ్ల షెడ్లపై స్ప్రింకర్లతో రోజుకు 3 సార్లు చల్లబరచకపోతే ఎండ వేడికి చనిపోతాయి. ఈ పరిస్థితుల్లో స్ప్రింకర్లతోపాటు కూలర్లు పెట్టిమరీ కోళ్ల ఫామ్ నిర్వాహకులు షెడ్లలో చల్లదనాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

అదే సమయంలో కరోనా మొదటి దశ తర్వాత కోళ్ల దాణాధరలు విపరీతంగా పెరిగాయి. కోడికి వేసే దాణాలో సోయ, మొక్కజొన్న ప్రధానమైనది. కరోనాకు ముందు కిలో సోయా రూ.35కు లభించేది. ఇప్పుడు కిలో రూ.105 నుండి 150 కు చేరింది. ఇక రూ.103కు కిలో లభించే మొక్కజొన్న దాణా ధర ఇప్పుడు తారస్థాయికి చేరింది. దీంతో కోళ్ల పెంపకంలో ఉత్పత్తి ఖర్చు పెరిగిపోయింది. దాణా , ఇతర ఖర్చులు పెరగడంతో చికెన్ ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. మరో వైపు పెళ్లిళ్ల సీజన్ వల్ల చికెన్‌కు భారీగా డిమాండ్ ఉంది. ఈ తరుణంలో చికెన్ కిలో ధర రూ.240 నుంచి రూ.300 వరకు పెరిగి ప్రస్తుతం 340 నుంచి 360 కి చేరుకుంది. పదిహేను రోజుల వరకు చికెన్ ధరలు తగ్గుముఖం పట్టే అవకాశం లేదని, పైగా ఇంకా పెరిగే అవకాశం ఉందని ఫామ్ నిర్వహకులు స్పష్టం చేస్తున్నారు. ఈనెల చివరి వరకు ఇదేవిధంగా రేట్లు ఉంటాయని చెబుతున్నారు.

బోటీకి డిమాండ్

చికెన్ ధర 360 కావడంతో మాంసం ప్రియులు బోటీని కొనుగోలు చేశారు. బోటీ ధర రూ.200లకు కిలో ఉంది. దీంతో బోటీకోసం మటన్‌షాపులవద్ద గుమిగూడారు. బోటీ కొనుగోలు పెరగడంతో అదిసైతం దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో చాలామంది వెనుదిరిగారు.

ఈనెలాఖరు వరకు 360కి పెరిగే అవకాశం

చికెన్ షాప్ నిర్వాకుడు-సురేష్



గత సంవత్సరంలా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో కోళ్లను పెంచడానికి కోళ్ల ఫారాల యజమానులు వెనుక ముందు కావడంతో రేట్లు అమాంతంగా పెరిగాయి. ఐదేళ్ల క్రితం సుమారు కిలోకు 150 రూపాయల రేటు ఉండేది. అమాంతంగా రెండింతల కు పైగా రేటు పెరగడంతో కిలోకొనేవారు అర్ధకిలతో సరిపెట్టుకుంటున్నారు. ఈధరకు అర్ధ కిలో మటన్ వస్తుందని ప్రజలు అంటున్నారు. కిలో 300 నుండి 320 రూపాయలకు స్కిన్లెస్ చికెన్ విక్రయిస్తున్నాం.

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలి

- తొమ్మిదేళ్లుగా బీఆర్ఎస్ అవినీతిలో కూరుకుపోయింది
- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ భూపతి రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న భూపతిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసు కొచ్చేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని, మాజీ ఎమ్మెల్సీ నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ ఇన్చార్జి, డాక్టర్ రెకులపల్లి భూపతిరెడ్డి అన్నారు.ఆదివారం ఇందల్ వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో మండలా కాంగ్రెస్ కార్య కర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ భూపతి రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు ఎన్ని చెప్పుకోలే ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రతి కార్యకర్త గ్రామాల్లో తి ఇంటింటికి తిరుగుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా ప్రతిరేఖ విధానాలను వివరించాలన్నారు. కర్ణాటకలో బిజెపి పార్టీకి గంగలో కలిపారని అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలో సైతం గంగాలో కలపడానికి సిద్ధంగా ఉన్నారని, దానికోసం ప్రతి కార్యకర్త సైనికులుగా పనిచేయాలన్నారు.. నల్లవెల్లి స్టేషన్ తాండ, మేగ్య నాయక్ తండా, కేకే తాండ, వెంగలపాడ్ గ్రామానికి చెందిన వీఆర్ఎస్ కార్యకర్తలు భూపతి రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతకుముందు నాయకులు, కార్యకర్తలు టీపీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ బిన్ హందన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్,కాటి పల్లి నాగేశ్ రెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, కిసాన్ కేత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి అవలంబిస్తున్న తీరును ఎండగట్టారు. కార్యక్రమంలో ఇందల్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోత్కూరి నవీన్ గౌడ్, కిసాన్ ఖేత్ మండల అధ్యక్షుడు ఎల్‌బిసి గంగాధర్, డిసిసి డెలిగేట్ వెంకటరెడ్డి, డిసిసి డెలిగేట్ సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో విద్యార్థులు, యువత పాల్గొనాలి

- కాంగ్రెస్ నాయకులు కోలా వెంకటేష్



ఆన్‌లైన క్విజ్ కరపత్రాలు ఆవిష్కరించిన నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

రాజీవ్ గాంధీ యూత్ ఆన్ లైన్ క్విజ్ కాంపిటేషన్‌లో విద్యార్థులు యువత భారీగా పాల్గొనాలని కాంగ్రెస్ నాయకులు కోలా వెంకటేష్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తితో నిర్వహిస్తున్న రాజీవ్ గాంధీ యూత్ ఆన్ లైన్ క్విజ్ కాంపిటేషన్‌పై కాంగ్రెస్ నాయకులు ఆదివారం పట్టణంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కోలా వెంకటేష్ మాట్లాడుతూ గాంధీ హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే యువతకు ఏం చేస్తుందో యూత్ డిక్లరేషన్‌ను ప్రకటించారని, అధికారంలోకి రాగానే మొదటి ఏడాది ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, ప్రతి ఏడాది జూన్ 2 న ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల జాబితా విడుదల చేసి సెప్టెంబర్ 17 లోపు భారీ చేస్తామని, నిరుద్యోగ యువతకు 4000 నిరుద్యోగ భృతి కల్పిస్తామని తెలిపారు. యూత్ కమిషన్ ఏర్పాటు చేసి యువతకు 10 లక్షల వరకు లోన్ ఇస్తామని అన్నారు. టీఎస్‌పీఎస్‌సీని ప్రక్షాళన చేసి యూపీఎస్‌సీ తరహాలో చేస్తామని తెలిపారు. ప్రయివేటు కంపెనీల్లో స్థానికులకు 75శాతం రిజర్వేషన్ కల్పిస్తాం అని అన్నారు. కొత్తగా యూనివర్సిటీలు, నాలుగు ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేస్తాయిని, ఫీజు రీయింబర్స్ మెంట్ కల్పిస్తామని అన్నారు. జూలై 2న నిర్వహిస్తున్న రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటేషన్ లో విద్యార్థులు యువత భారీగా పాల్గొనాలని పిలుపు ఇచ్చారు. ఈ క్విజ్ కాంపిటేషన్ లో పాల్గొనడానికి ముందుగా రిజిస్టర్ చేసుకోవాలి అని రిజిస్టర్ చేసుకోడానికి 7661899899 నంబర్ కి మిస్ కాల్ లేదా %తీఖయఱజస్త్రుఅఎష్త్రఱఎశీట్ష్తనబఱఓ.ఔఏ% వెబ్ సైట్ లోకి వెళ్లి వివరాలు పొందుపరిస్తే హాల్ టికెట్ నంబర్ వస్తుందని చెప్పారు. రిజిస్టర్ చేసుకోడానికి చివరి తేదీ జులై ఒకటి అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మీర్ మాజీద్, అనిల్ రావు, జిమ్మి రవి, మీసాల రవి, బాల కిషన్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

- టీఎస్‌యుటిఎఫ్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి సత్యానంద్

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఫ్) రాష్ట్ర కార్యదర్శి డి. సత్యానంద్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు అధిక సంఖ్యలో ఖాళీగా ఉండడంతో పాఠశాలల నిర్వహణకు ఇబ్బందులు ఏర్పడుతుందన్నారు. సబ్జెక్ట్ టీచర్స్ కొరత ఉండడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందదని అన్నారు. పదోన్నతులు, బదిలీలు అనేవి కేవలం ఉపాధ్యాయులకు సంబంధించిన అంశం కాదని అది ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సంబంధించిన అంశం అని అన్నారు. పదోన్నతుల ద్వారా ఏర్పడిన ఖాళీలను ఉద్యోగ నియామక ప్రక్రియ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 2011, 2012, 2015 నుండి ఒకే చోట పని చేస్తున్న ఉపాధ్యాయులు బదిలీల కోసం ఎదురు చూస్తున్నారని , వెంటనే బదిలీల ప్రక్రియను ప్రారంభించాలని అన్నారు.317 జీ.ఓ. వల్ల స్థానికేతర జిల్లాలకు కేటాయించిన ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు బదిలీ చేయాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పథకం పునరుద్ధరించాలని పిఎఫ్ఆర్‌డిఏ చట్టం రద్దు కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ యుఆర్ఎస్ పాఠశాలల్లో కాంట్రాక్టు పద్దతిలో పనిచేస్తున్న వారందరికీ బేసిక్ పే అమలు చేసి వారి సర్వీస్ ను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులకు పని ఒత్తిడి తగ్గించి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, అందరికీ ఒకే సమయ పాలన అమలు చేయాలని, ప్రమోషన్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ టీచర్స్ బదిలీలు,పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎయిడెడ్ టీచర్స్ కి నెల నెల వేతనాలు చెల్లించాలని అన్నారు. అన్ని మేనేజ్మెంట్ పెండింగ్ బిల్లులను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, స్వర్ణలత,.జిల్లా కార్యదర్శులు రాజారామ్, సాయన్న జిల్లా కమిటీ సభ్యులు ప్రభాకర్, ప్రవీణ్, భూమేశ్వర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఇందూరు టీవీ టెక్నీషియన్ యూనియన్ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గాయత్రి నగర్‌లో ఇందూర్ టీవీ టెక్నీషియన్ యూనియన్ నూతన భవనాన్ని ఆదివారం అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ.. 2018లో సమావేశానికి వచ్చినపుడు స్థల సేకరణ చేస్తే నిధులు ఇస్తానని మాటిచ్చానని తెలియజేశారు. ఇచ్చిన మాట ప్రకారమే ఎమ్మెల్యే కోట సీడీపీ నిధులనుండి 7లక్షలా 20వేల నిధులు మంజూరు చేశారు. యూనియన్ సమస్యలు పరిష్కరించుకోవడానికి, సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి అనువైన స్థలంగా ఈ భవనం ఉపయోగ పడుతుందని అన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతు కిరణ్ , ప్రభాకర్ రెడ్డి, టిఆర్ఎస్ నగర అధ్యక్ష కార్యదర్శులు సిర్ప రాజు, యెనుగందుల మురళి, టీవీ యూనియన్ సభ్యులు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

విత్తనాలు, పురుగు మందులు ఉచితంగా అందించాలి : ఏఐపీకేఎస్



మాట్లాడుతున్న నాయకులు దాసు

నవతెలంగాణ-ఆర్మూర్

2023 ఖరీఫ్ సీజన్లో రైతులందరికీ లక్ష రూపాయల అప్పులని ఏకకాలంలో రద్దు చేయాలని, నూతన అప్పులు వెంటనే ఇవ్వాలని, అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఉచితంగా ఇవ్వాలని ఏఐపీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి దేవరం అన్నారు. అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం (ఐపీఎస్) జిల్లా కార్యవర్గ సమావేశం పట్టణం లోని సిపిఐఎంఎల్ ప్రజాపంథా కార్యాలయం కుమార్ నాయన భవన్‌లో జిల్లా అధ్యక్షులు ఎస్ సురేష్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా దేవారాం మాట్లాడుతూ.. రబి పంటలన్నీ అకాల వర్షాలు, వడిగళ్ళ వానకు లక్షలాది ఎకరాల్లో నష్టం వాటిల్లిందన్నారు. తాత్కాలిక సహాయం కింద పదివేల రూపాయల అందిస్తానన్న కేసీఆర్ వాగ్దానం నీటిమూటగాఅయిందని ఎద్దేవా చేశారు. నష్టపోయినవాణిజ్య పంటలకు, ఎకరానా లక్ష రూపాయలు, ఇతర పంటలకు ఎకరాన 50వేల రూపాయలు, నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే లక్ష రూపాయల వడ్డీ మాఫీ చేసి ఖరీఫ్ సీజన్‌కు బ్యాంకులో రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తన వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రతి పంటకు బోనస్ ప్రకటించాలని కేసీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎరువులు, పురుగుమందులు, రబి సీజన్ నష్టపరిహారం చెల్లించాలని మండలాల్లో ఆందోళనలు, 22న జేడీఏ కార్యాలయం ముందు ధర్నా చేపడుతున్నట్టు తెలిపారు.. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్.. జిల్లా ఆఫీస్ బేరర్లు పుట్టి నాగన్న, బాబన్న, మల్లన్న ఆకుల గంగారం, బాలయ్య గంగాధర్..యు. రాజన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ

- కేసీఆర్ మానసపుత్రిక మిషన్ భగీరథ
- ఆర్టీసీ చైర్మన్,ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- ఇంటింటికి మంచినీరు అందిస్తున్నాం
- జడ్పీ చైర్మన్ దాదాన్న గారి విట్టల్ రావు, ఎమ్మెల్యే జీవన్ రెడ్డి
- గ్రామాల్లో మంచినీటి పండుగ

నవతెలంగాణ-విలేకరులు

డిచ్‌పల్లి:దేశానికే ఆదర్శంగా నిలిచిన ముఖ్యమంత్రి కేసీఆర్ మానసపుత్రిక "మిషన్ భగీరథ" అని, వంద శాతం స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని, అడుగంటిన తెలంగాణ భూగర్భ జలాలు నాడు ఉండేదని, చెక్ డ్యాంల నిర్మాణంతో బావుల్లో ఊటలు నేడు ఉన్నాయని ఎక్కడ చుసిన నీళ్ల ట్యాంకర్ల వద్ద బిందెడు నీటి కోసం ఆడబిడ్డలకు ఇక్కట్లు ఉండేదని నేడు ఆపరిస్థితి లేదని ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంలో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఇందల్‌వాయి మండల కేంద్రంలో నీటి శుద్ధి కేంద్రం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మంచినీళ్ల పండగ తాగునీటి విజయాలపై సభలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్, నిజామాబాద్ రూరల్ బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణ మంచినీళ్ల పండుగ మిషన్ భగీరథ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ప్రతి ఇంటింటికి తాగునీటి అందించడం కోసం, ఖర్చు చేసిన వివరాలను అంకెలతో సహా వివరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, వైస్ ఎంపీపీ భూసాని అంజయ్య, ఇందల్ వాయి మండల అధ్యక్షులు చిలువేరి దాసు , సొసైటీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు పాశం కుమార్, అరటి రఘు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ, ఎంపీటీసీలు తహసిల్దార్ టివి రోజా, ఎంపిడిఓ రాములు నాయక్, జడ్పిటిసిలు, ఎంపీపీలు, మండల అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, మిషన్ భగీరథ అధికారులు, తాగునీటి శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు, ఐకెపి సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ఆర్మూర్ : ప్రతి ఇంటింటికి మంచినీరు అందిస్తున్నామని జడ్పీ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు, ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి లు అన్నారు. అర్గుల్ శివారు లోని మిషన్ భగీరథ గ్రిడ్ వద్ద ఆదివారం జరిగిన మంచినీళ్ల పండగ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.శుద్ధమైన నీటిని ఇంటింటికీ నల్లాల ద్వారా సరఫరా చేస్తూ కొత్త తాగునీటి శకానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్ తెలంగాణ ప్రజల పాలిట దేవుడు అని అన్నారు. మిషన్ భగీరథ వంటి సక్సెస్ ఫుల్ ప్రాజెక్టు ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు.. గుక్కెడు నీళ్ళ కోసం మైళ్ళ కొద్ది నడక. మంచినీటికోసం మహిళల మధ్య కొట్లాటలు. ఆర్మూర్ లోని రాజారాం నగర్ లో మంచినీటి కోసం హత్య కూడా జరిగిందని తెలిపారు. కృష్ణా, గోదావరి జలసిరితో తెలంగాణలో తాగు, సాగు నీటి గోస లేకుండా చేసిన అపర భగీరథుడు కేసీఆర్ అని తెలిపారు. కార్యక్రమంలో , వైస్ ఛైర్మన్ రజితా యాదవ్, మున్సిపల్ ఛైర్మన్ పండిత్ వినితాపవన్, వైస్ ఛైర్మన్ మున్నుభాయ్, , ఎంపీపీ పస్క నర్సయ్య, జడ్పిటిసి మెట్టు సంతోష్ మాక్లూర్ వైస్ ఎంపీపీ సుక్కి సుధాకర్, సర్పంచులు,ఎంపీటీసీలు, జిల్లా పరిషత్ సీఈవో గోవింద్, బీఆర్ఎస్ పార్టీ నందిపేట్ మండల అధ్యక్షులు మచ్చర్ల సాగర్, కౌన్సిలర్లు, కమిషనర్ ప్రసాద్ చౌహన్, తహసిల్దార్ వేణుగోపాల్ గౌడ్, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి :మండలంలోని ఆయా గ్రామాల్లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సర్పంచుల ఆధ్వర్యంలోమంచినీళ్ల పండుగ కార్యక్రమాన్ని పండుగల నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ ఎండాకాలం వస్తే నీళ్ల లేక వాడవాడలో నీటి కోసం బిందెలు పట్టుకొని ప్రజలు అల్లాడేవారన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత నీటి కోసం ఏ ఒక్క ఆడపడుచు కూడా బిందెలతో బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. మంచిని ట్యాంకుల వద్ద ప్రత్యేక పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

మోపాల్:మండలంలోని సిర్పూర్ గ్రామంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంచినీళ్ల పండగను సర్పంచ్ సామ ముత్యం రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీఎం కేసీఆర్ దయవల్ల ఇంటింటికీ నల్లా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో కూడా నల్లాలు ఏర్పాటు చేశామని అన్నారు. చుక్క బొట్టు నీటిని కూడా వృధా చేయమని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెల్మ శ్రీను, ఎంపీటీసీ రఘు, వీడిసి ప్రెసిడెంట్ చిన్నారెడ్డి, గ్రామపంచాయతీ సెక్రెటరీ నవీన్, మండల డ్వాక్రా సంఘం అధ్యక్షురాలు విప్లవకుమారి, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు



ఆర్మూర్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



కమ్మర్‌పల్లిలో..

యువతకు క్రికెట్ కిట్టును అందజేత


క్రికెట్ కిట్టును అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కూనేపల్లి సర్పంచ్ రొడ్డ విజయ లింగం స్థానిక యువతకు క్రికెట్ కిట్టును అందజేశారు. నేటి సమాజంలో యువత చెడు వ్యసనాలకు బానిసై రోడ్డున పడుతున్నారని, యువత దృష్టిని క్రీడల వైపు మళ్లించడానికి ఈ క్రికెట్ కిట్టును అందజేసినట్టు ఆమె పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో యువతకు చేయూతనందిస్తే ఆ గ్రామం అభివృద్ధి వైపు వెళ్లగలదని ఆమె ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శివకృష్ణ, రొడ్డలింగం, అంగన్వాడీ ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యం రంజిత్

- జేఈఈ ఫలితాల్లో జాతీయ స్థాయిలో
- బీసీ కేటగిరీలో 6167 ర్యాంక్


స్వీటు తినిపిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని తిప్పారం తాండాకు చెందిన మంజ పెంటయ్య కుమారుడు మాంజ రంజిత్ ఇంటర్ గౌలిదొడ్డి సోషల్ వెల్ఫేర్ కాలేజ్‌లో చదువుకున్నాడు. కాగా ప్రభుత్వం విడుదల చేసిన జేఈఈ ఫలితాలలో జాతీయ స్థాయిలో బీసీ కేటగిరీలో 6167 ర్యాంక్ రావడంతో పాటు ఇంటర్‌లో 979 మార్కులు సాధించాడు. జేఈఈ మంచి ర్యాంక్ సాధించడంలో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తండా సర్పంచ్ సుందరిబాయి బిషన్ నాయక్ రంజిత్‌కు స్వీటు తినిపించి అభినందించారు.

యథేచ్ఛగా చెరువులో తవ్వకాలు

- ఇటుక బట్టీలకు నల్లమట్టి తరలింపు
- అనుమతులు లేకుండానే ఈ తతంగం
- లక్షల రూపాయలు ప్రభుత్వ ఆదాయానికి గండి


చెరువుల్లో నుంచి తవ్వుతున్న మట్టి..


ఇటుక బట్టి వద్ద కుప్పలుగా పోసిన నల్లమట్టి

నవతెలంగాణ-బిచ్కుంద

పొలాల్లోకి చేరాల్సిన చెరువు పూడిక మట్టి ఇటుక బట్టీలకు చేరుతోంది. పంట పొలాలకు సారాన్ని అందించేందుకు ఉపయోగపడే మట్టిని అక్రమంగా ఇటుక బట్టీలకు తరలిస్తూ మట్టి మాఫియా లక్షల రూపాయలు ఆర్జిస్తూ అక్రమ మట్టి దందా కాంట్రాక్టర్ల జేబులు నింపుతోంది. రైతుల పొలాలకు చేరాల్సిన మట్టితో మాఫియా సహకారం ఉండడంతో టన్నుల కొద్ది చెరువులోని పూడిక మట్టి ట్రాక్టర్ల ద్వారా ఇటుక బట్టీల వద్దకు తరలించి నిల్వ చేస్తూ ఇటుక బట్టి యజమానులు లక్షల్లో ఆదాయం సమకూర్చుకుంటున్నారు. చెరువులోని మట్టి అక్రమంగా తరలిస్తున్న పట్టించుకునే వారు కరువైపోవడంతో అక్రమ మట్టి వ్యాపారులు మరింతగా రెచ్చిపోతున్నారు.

శనివారం, ఆదివారం మండలంలోని గుండె నెమలి గ్రామ శివారులో గల చిక్కిచెరువులో నుంచి అనుమతులు లేకుండా జేసీబీల ద్వారా అక్రమంగా నల్ల మట్టిని తోడి ట్రాక్టర్ల ద్వారా వాజీద్‌నగర్ గ్రామ శివారులో గల బాన్సువాడ బిచ్కుంద ప్రధాన రహదారి పక్కన గల ఇటుక బట్టీలోకి వందల ట్రాక్టర్ల నల్లమట్టిని తరలించి డంపులు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అధికారుల ద్వారా అనుమతి తీసుకుని ప్రభుత్వానికి ప్రతి టాక్టర్‌కు 120 రూపాయలు రాయల్టీ చెల్లించి అధికారుల సమక్షంలో ప్రైవేట్ వ్యాపార అవసరాల కోసం మట్టి రవాణా చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘించి అక్రమంగా, అనుమతులు లేకుండా చెరువులోని మట్టి ఇటుక బట్టీలకు రవాణా చేస్తూ ప్రభుత్వ ఖజానాకు లక్షల రూపాయలలో గండి కొడుతున్నారు.

చెరువులో పది అడుగులకుపైన తవ్వకాలు..

చెరువు కింద ఉన్న భూముల రైతులు సేద్యం చేసుకుని పంటలు పండియాలంటే చెరువులు బాగుండాలి. చెరువుల్లో నీరు చేరినప్పుడే ఆయకట్టు ప్రాంతంతో పాటు చెరువు నీరు పారుదల ఉన్న ప్రాంతమంతా పచ్చగా కళకళలాడుతుంది. అలాంటి చెరువులు నేడు మట్టి మాఫియా కారణంగా కళను కోల్పోయి రూపురేఖలు మారిపోతున్నాయి. చెరువుల్లో యథేచ్ఛగా నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తవ్వేయడంతో చెరువుల్లో నీరు వచ్చినా నిలబడే పరిస్థితి కనబడటం లేదు. ఎక్కడపడితే అక్కడ 10 అడుగులకు పైగా మట్టిని తవ్వేస్తూ అక్రమ నల్ల మట్టి రవాణా జోరుగా సాగుతుండటంతో చెరువుల పరిస్థితి దారుణంగా తయారైంది. అధికారుల అనుమతి తీసుకొని చెరువు కట్టకు 100 మీటర్ల దూరంలో తవ్వకాలు జరపాలని నిబంధనలు ఉన్నా అందుకు విరుద్ధంగా చెరువు కట్టకు ఆనుకునే మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. దీంతో చెరువు కట్టకే ప్రమాదం ఏర్పడే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దారి కోసం చెట్లు నరికివేత..

బాన్సువాడ, బిచ్కుంద ప్రధాన రహదారి నుంచి చిక్కి చెరువుకు వెళ్లాల్సిన దారి లేకపోవడంతో రహదారి పక్కన నాటిన చెట్లను కొమ్మలను నరికివేసి జేసీబీ ద్వారా తొలగించారు. సామాన్య ప్రజలు వంట చెరుకు కోసం అడవిలో ఇతర చోట్లలో చెట్లను నరికి వేస్తే కేసులు నమోదు చేసే ఫారెస్ట్ అధికారులు ప్రధాన రహదారి పక్కన నరికి వేసిన చెట్లను గమనించకపోవడం, అక్రమ మట్టి మాఫియా యథేచ్ఛగా చెట్ల నరికి వేయడంతో ఫారెస్ట్ అధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది. నరికిన చెట్టుకొమ్మలు, చెట్లను అనుమతులు లేకుండానే ఇటుక బట్టీల కోసం వాడుకుంటున్నారని ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చెరువుల నుంచి తీసిన మట్టిని ఇటుకల తయారీ కోసం బట్టీల వద్దకు తరలించరాదని నిబంధనలు ఉన్నా నిబంధనలు ఉల్లంఘించడం వల్ల ప్రభుత్వ ఖజానాకు లక్షల్లో నష్టం వాటిల్లుతోంది. ఈ నల్ల మట్టి రవాణ వ్యాపారం స్థానిక రెవెన్యూ అధికారులకు తెలిసే జరుగుతున్నదా అని మండల ప్రజలు, రైతులు చర్చించుకుంటున్నారు. జిల్లా కలెక్టర్, డివిజన్ రెవెన్యూ అధికారులు మట్టి దందాపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చెరువుల్లో తవ్విన మట్టిపై విచారణ జరిపి బట్టీల వద్ద కుప్పలుగా పోసిన మట్టిని పరిశీలిస్తే ఏ మేర అక్రమాలు జరిగాయో తెలిసే అవకాశాలున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులతో పాటు అన్ని శాఖల అధికారులు అక్రమ మట్టి దందాపై కొరఢా ఝుళిపించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న నన్నేసాబ్

నవతెలంగాణ-వర్ని

ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) వర్ని ఏరియా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం వర్ని మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏరియా కమిటీ సమావేశాన్ని మేకల మల్లేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఏరియాలోని 6 మండలాల పార్టీ నాయకులు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ.. ఇండ్లస్థలాలు లేని నిరుపేదలకు ప్రభుత్వ స్థలంలో స్థలం కేటాయించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో స్థానిక సమస్యలపై సర్వే చేపడుతున్నామని సర్వేలో వచ్చిన సమస్యలపై పోరాటాలను రూపొందించుకుంటున్నామని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు మేకల మల్లేష్, బొర్ర గంగాధర్, నాగేష్, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు బియ్యం పంపిణీ


బియ్యం పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని రాంపూర్ గ్రామంలోని శనివారం రాత్రి సమయంలో గండికోట అంజయ్య నివాసపు గుడిసె ప్రమాదవశాత్తు కాలిపోయింది. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయారు. ఆదివారం ఘటన స్థలానికి సర్పంచ్ హన్మవ్వ కిషన్, ఎంపీటీసీ గన్ను నాయక్, ఉపసర్పంచ్ యదగౌడ్ అక్కడికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితురాలిని అన్ని విధాలుగా ఆదుకుంటామని వారు భరోసానిచ్చారు. 40 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. దాతలు ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కిషన్, సాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్న బిచ్కుంద తహసీల్దార్


పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

నవతెలంగాణ-బిచ్కుంద

మండలంలోని ఖత్గాం, షెట్లూర్, హజ్గుల్ గ్రామాల మంజీరా పరివాహక ప్రాంతం నుంచి రాత్రి సమయాల్లో అనుమతులు లేకుండా 20 నుంచి 50 ట్రాక్టర్ల వరకు యథేచ్ఛగా గత నెల రోజులుగా అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్టు బిచ్కుంద తహసీల్దార్ భరత్ దృష్టికి రావడంతో శనివారం రాత్రి తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహించి తనిఖీలు చేశారు. ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో ఖత్గాం గ్రామానికి చెందిన నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గత కొన్ని రోజులుగా తహసీల్దార్ సెలవులో ఉండడంతో పోలీసులు, వీఆర్ఏలు ట్రాక్టర్ల యజమానుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తూ ఇసుక రవాణా చేసుకునేందుకు సహకరిస్తున్నట్లు సమాచారం. పట్టుకున్న నాలుగు ట్రాక్టర్లపై తదుపరి చర్యల నిమిత్తం బాన్సువాడ ఆర్డీవోకు సమాచారం ఇచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. రాత్రి సమయంలో అనుమతులు లేకుండా ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణాను అరికట్టడానికి ప్రత్యేక టీంను పంపాలని జిల్లా అధికారులకు కోరడమైనదని తహసీల్దార్ తెలిపారు. ఆయన వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా, వీఆర్ఏలున్నారు.

ప్రజాస్వామ్యంలో అభివృద్ధిపై అడిగే హక్కు ఉంది


మాట్లాడుతున్న మోహినుద్దీన్

నవతెలంగాణ-బోధన్

ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులను అభివృద్ధి పనులపై నిలదీసే హక్కు, అడిగే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మోహినుద్దీన్ అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే నియోజకవర్గంలో పర్యటిస్తున్న సమయంలో, ఎంఐఎం కౌన్సిలర్లు, ప్రజలు ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌కు అభివృద్ధి పనులపై నిలదీశారని అన్నారు. దాంతో ఎమ్మెల్యే నిలదీసిన వారిపై అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ఎంఐఎం కౌన్సిలర్లపై పెట్టిన కేసులను ఎమ్మెల్యే తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జనరల్ సెక్రెటరీ హరికాంత్ చారి, యూత్ ప్రెసిడెంట్ తలారి నవీన్, డిస్ట్రిక్ మైనార్టీ వైస్ చైర్మన్ బడు, చిరంజీవి, ఆమెన్, జహీర్, వాహిద్, ఇనాయత్ అలీ, ప్రసాద్, ఆర్.నవీన్, ఉమర్ పాల్గొన్నారు.

పెగాడపల్లిలో ఆన్లైన్ క్విజ్‌పై అవగాహన


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

మండలంలోని పెగాడపల్లి గ్రామంలో ఆదివారం యూత్ కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ ఆన్లైన్ క్విజ్‌పై యువకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యూత్ నాయకులు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ ఆన్లైన్ క్విజ్ పోటీలల్లో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు, నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చి మోసం చేసిందని, నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేసిందన్నారు. ఈ ప్రభుత్వంపై విద్యార్థులు, నిరుద్యోగులు ప్రశ్నిస్తే కేసులు పెట్టనున్నట్టు తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ పరీక్షలు రాస్తే అన్ని లీకులు అని అన్నారు. ఏ నమ్మకంతో పరీక్షలు రాయాలని ఈ ప్రభుత్వంపై ఘాటుగా విమర్శించారు. ఈ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడితే యూత్ కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని, అన్ని వర్గాలకు న్యాయం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షబ్బీర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సార్గం పోతరెడ్డి, సుదర్శన్, నాగరాజు, సార్గం మల్లారెడ్డి, రాజు, హైమద్, ఫక్రు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని మత్తడి కిందిపల్లికి చెందిన మృతుల కుటుంబాలకు బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదేశానుసారం ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. మండల కేంద్రంలోని మత్తడి కిందిపల్లికి చెందిన జానపద కళాకారుడు మంగలి రాములు పంతులు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని బీఆర్ఎస్ మండల నేతలు పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్‌తో మాట్లాడి ఆయన కుటుంబానికి ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన అంత్యక్రియల నిమిత్తం ఎమ్మెల్యే ఆర్థికసాయం అందజేశారు. అనంతరం అదే కాలనీకి చెందిన ఒడ్డె బొంతల మానెవ్వ అనారోగ్యంతో మృతి చెందిన ఆమె కుటుంబాన్ని సైతం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముదాం సాయిలు, గాండ్ల నర్సింలు, నయీమ్, శ్రీకాంత్, సునీల్, శంకర్, సందీప్ పాల్గొన్నారు.

సీపీఐఎంఎల్ ప్రజాపంథా సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్న నాయకులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామంలో అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్టు మండల కార్యదర్శి ఎస్కె నసీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోటి ఆశలతో తెలంగాణను తెచ్చుకున్నామని, వ్యవసాయ కార్మికులకు ఔట్‌సోర్సింగ్‌లో భర్తీ చేసి వారికి ఉద్యోగ భృతి కల్పించాలన్నారు. కార్మికులకు ఐడెంటిటీ కార్డులు మంజూరు చేసి నిరుపేదలకు రేషన్ కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇండ్లు నిర్మించుకోలేని నిరుపేదలందరికీ ప్రభుత్వం పది లక్షల రూపాయలను ఇవ్వాలన్నారు. నిరుద్యోగులందరికీ 10 వేల రూపాయల నిరుద్యోగ భృతిని కల్పించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు వడ్డన్న, మండల నాయకులు ఎల్ గంగాధర్, జిడ్డు భారతి, నీరెడ్డి ఆజన్న, తరుణ్, బండారి మరుగన్నతో పాటు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ మండల కుమ్మర శాలివాహన సంఘం కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గం

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండలం కుమ్మర (శాలివాహన) సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు జిల్లా అధ్యక్షుడు (ఎంపీటీసీ) కుమ్మరి రాములు, జిల్లా కార్యదర్శి డాకురి మోహన్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా తమ కులస్తులు రాజకీయంగా వెనుకబడి ఉన్నారని వారిని అన్ని విధాలుగా చైతన్యపరిచేందుకు కృషి చేస్తూ, అందులో భాగంగా మండల కమిటీలు పూర్తయిన అనంతరం జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి జిల్లా కుమ్మరి కులస్తుల సమక్షంలో జిల్లా కమిటీని ఏర్పాటు చేసుకున్నట్టు తెలిపారు. ఆదివారం దోమకొండ మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలోని ప్రాంగణంలో మండల కులస్తుల సమక్షంలో మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా దుంపటి కాశయ్య (దోమకొండ), అధ్యక్షులుగా సాహెబ్ గారి శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులుగా సాహెబ్ గారి విజయ్, రాచర్ల రవీందర్, మీడియా ఇంచార్జిగా దుంపటి గంగాధర్, ఉపాధ్యక్షులుగా రాచర్ల బాబు, శనిగారం రాజు ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి సేనాపతి, కోశాధికారిగా కుమ్మరి సంతోష్, సహాయ కార్యదర్శులుగా డాకూరి శంకర్, కుమ్మరి ప్రభాకర్, శనివారం రవి, రాచర్ల రాజం, కుమ్మరి నవీన్, సాయిబుగారి నవీన్, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డాకూరి మోహన్, జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


కోదండ రామచంద్రస్వామి దేవస్థానం నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని తిప్పారం తండాలో నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ కోదండ రామచంద్ర స్వామిదేవస్థానం నిర్మాణానికి తిప్పారం గ్రామానికి చెందిన బంగారువాడి గంగారాం తండ్రి కిషన్‌రావు తిప్పారం ఆదివారం తిప్పారం తాండ గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీశ్రీశ్రీ కోదండ రామచంద్ర స్వామి దేవస్థానం నిర్మాణానికి తన వంతుగా రూ.50,111 విరాళంగా సర్పంచ్ సుందరి బాయి బిషన్ నాయక్, ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గంగారాం, పెంటయ్య, ఆలయ కమిటీ సభ్యులు తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామస్థాయి కమిటీల ఎన్నిక


ఎన్నికైన గ్రామ కమిటీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో నూతన కమిటీలను ఆదివారం ఎనున్నకున్నట్టు ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు లక్ష్మీగారి భూమయ్య, మండల సీనియర్ నాయకులు బండారి పోశెట్టి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మిషన్ 25 రోజుల ప్రణాళికలో భాగంగా ఈ కమిటీలను ఎంపిక చేయనున్నట్టు వారు పేర్కొన్నారు. కల్లాపూర్ గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులుగా కిన్నెర స్వామి, ఉపాధ్యక్షులుగా పిల్లల చరణ్, ప్రధాన కార్యదర్శిగా కిన్నెర శివ, పిల్లల రవి, కార్యదర్శిగా కిన్నెర గణేష్, బంటు అక్షయ్, కోశాధికారిగా బొమ్మ శివకుమార్, ప్రచార కార్యదర్శులుగా బొమ్మ గంగాధర్, కిన్నెర మోహన్, కార్యవర్గ సభ్యులుగా బంటు సాయికుమార్, పిల్లల సాయికుమార్, నరేందర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

అతిరథ భగీరథుడు షబ్బీర్ అలీ

- జిల్లా పరిషత్ ఫ్లోర్ లైడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి


మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-సదాశివనగర్

అతిరథ భగీరథుడు మహమ్మద్ షబ్బీర్ అలీ అని, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి సహకారంతో కామారెడ్డి ప్రజల దాహార్తిని తీర్చిన మహనీయుడు మహమ్మద్ షబ్బీర్ అలీ అని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. మల్లన్నగుట్ట వద్ద వాటర్ ప్లాంట్ నిర్మించిన ఘనత షబ్బీర్ అలీకి దక్కుతుందని అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బీఆర్ఎస్ నాయకులు, ప్రజా, రైతు సమస్యలను గాలికి వదిలి, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. మళ్లీ బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే ప్రతి ఒక్కరికి, అడుక్కొనడానికి చిప్ప చేతికొస్తుందని, ప్రజలు గమనించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి, ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేసుకునే బాధ్యత ప్రజలపై ఉందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మద్దెల భాగయ్య, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, బీపేట నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-సదాశివనగర్

విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడుగా వడ్ల బాల్‌రాజును ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా రాజమహేందర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బాల్‌రాజు మాట్లాడుతూ.. తనపై ఉన్న నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం అభివద్ధికి ఎల్లవేళలా కషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు నర్సింలు, లింగం, భాస్కర్, మహేష్, శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

యూవీకేన్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 52 మంది రక్త దానం చేసి విజవంతం చేశారని యు వి ఫౌండేషన్ డైరక్టర్ సృజన్ తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు రక్తదానం చేసేందుకు వచ్చారన్నారు. సర్పంచ్ అనూష లక్ష్మణ్‌నాయక్, యూవీకే సభ్యులు నవనాత్ గౌడ్, అనిల్, రాజు తదితులున్నారు



రక్తదానం చేస్తున్న యువకులు

నేటి ప్రజావాణి వాయిదా

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్టు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్టు పేర్కొన్నారు. తిరిగి ఈ నెల 26 నుండి ప్రతి సోమవారం యధావిధిగా ప్రజావాణి కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

పట్టణంలో వీధికుక్కల బెడద

- భయాందోళనలో స్థానికులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణం, పల్లె అనే తేడా లేకుండా వీధి కుక్కల బెడద తీవ్రం అవుతోంది. దీంతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. ఇటీవల పట్టణంలోని జిరాయిత్ నగర్‌లో పెంపుడు కుక్కలు రెచ్చిపోయి కాలనీ వాసులను భయాందోళనకు గురిచేశారు. పిల్లలు మొదలు పెద్దల వరకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లేందుకు భయపడుతున్నారు. కుక్కల దాడితో వాహనదారులు, పాదాచారులు బెదిరిపోతున్నారు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. తరచుగా కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇందులో అత్యధికంగా చిన్నారులే ఉండడం గమనార్హం.

జిల్లా వ్యాప్తంగా...

జిల్లా వ్యాప్తంగా 2893 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. నిజామాబాద్, ఆర్మూర్ పట్టణాల్లో తరచూ కుక్కలు పిల్లలను తీవ్రంగా గాయపరుస్తున్నాయి. గత సంవత్సరం అక్టోబర్ మొదటి వారం జిల్లా కేంద్రంలో ఒకేసారి ఎనిమిది మంది చిన్నారులపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. జిల్లా కేంద్రంలో 60 డివిజన్లు ఉండగా సుమారుగా ఒక్కో డివిజన్లో 50 నుంచి 80 వరకు



బహిరంగ ప్రదేశంలో కుక్కలు

కుక్కలు ఉన్నాయి.

కుక్కలతో ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయని కార్పొరేటర్లు సైతం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు సైతం చేశారు. అధికారులు చెబుతున్న లెక్కల కంటే అనేక రేట్లు కుక్కలు దాదాపు అన్ని వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. చిన్నారుల తల్లిదండ్రులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ కుక్కలు దాడులు చేస్తున్నాయి. పాఠశాల ప్రారంభంకావడంతో ఇంటికి వస్తున్న చిన్నారులు రోజు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. పెద్దవాళ్లు సైతం కుక్కల దాడికి భయపడుతూ సంచరించాల్సిన దుస్థితి నగరంతో పాటు, ఆర్మూర్లో ఎక్కువగా ఉంది..

పట్టణంలో...

పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లో కుక్కల బెడదతో ప్రజలు నిత్యం భయాందోళనతో జీవిస్తున్నారు.. ఏ వీధిలో చూసిన కుక్కలు గుంపులుగా సంచరిస్తూ దారి వెంట వెళ్లే వారిపై దాడులకు యత్నిస్తున్నాయి. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు కాలనీలలో తిరిగేందుకు జంకుతున్నారు. ప్రతినెల సుమారుగా 100 వరకు కుక్కకాటు కేసులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో నమోదు అవుతున్నాయి.

అధికారులు నామమాత్రపు చర్యలు చేపడుతున్నారన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. మున్సిపల్ సమావేశాలలో సైతం పలువురు కౌన్సిలర్లు కుక్కలు, పందులు కోతులు దోమల బెడదతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుపుతున్న అందుకు కావలసిన చర్యలు ముందుకు సాగడం లేదు. గత ఆరు నెలల కింద వాటిని తరలించేందుకు సుమారుగా రెండు లక్షల 80వేలు ఖర్చు చేశారు. జంతు ప్రేమికుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది..

కొన్ని నెలల నుండి కుక్క కాట్ల వివరాలు....

జనవరిలో202, ఫిబ్రవరిలో 201, మార్చిలో 226, ఏప్రిల్ లో 180, మే 15వ తేదీ వరకు99 నమోదయ్యాయి.

అధికారులు స్పందించాలి



పట్టణంలోని కాలనీల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఖాళీ స్థలాలు కొత్తగా నిర్మాణాలు చేసే స్లాబులపైన ఉంటు న్నాయి. రాత్రి సమయాలలో చేసే శబ్దాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం సమయంలో వాకింగ్‌కు వెళ్లే వారిపై దాడులు చేస్తున్నాయి. అధికారులు స్పందించాలి.

హరిణి, సరస్వతి నగర్, ఆర్మూర్.

ఆదేశాలు జారీ చేశాం

పట్టణంలో కుక్కలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్టు మా దృష్టికి వచ్చింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అవసరమైన చర్యలు తీవ్రతరం చేసేందుకు అధికారులను ఆదేశిస్తున్నాం.

పండిత్ వినీత పవన్, మున్సిపల్ చైర్ పర్సన్, ఆర్మూర్.

గల్ఫ్ బాధితుడిని పరామర్శించిన కోటపాటి



గల్ఫ్ బాధితుడిని పరామర్శిస్తున్న కోటపాటి నరసింహ నాయుడు

నవతెలంగాణ-ఆర్మూర్

వన్నెల(బి) గ్రామవాసి సాయినాథ్ ఆదివారం పట్టణానికి చెందిన ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమవేదిక అధ్యక్షులు కోటపాటి నరసింహ నాయుడు పరామర్శించినారు. కూలి పనులు చేసుకుని బతికే సాయినాథ్ బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లడం కోసం ఏజెంట్ల వలలో పడి అక్కడి పరిస్థితులు అనుకూలించక అప్పులపాలై పిచ్చివాడిగా మారి వాపస్ వచ్చారు. దీంతో కోటపాటి ఆదివారం ఆయన పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. సాయినాధున్ని ఆర్మూర్ కు చెందిన సంజీవ్ అనే ఏజెంటు మాయ మాటలు చెప్పి దుబాయిలో మంచి ఉద్యోగం ఉందని నమ్మించి 75 వేల రూపాయలు అప్పు చేయించి మరి పంపాడు. అక్కడికి వెళ్లిన సాయినాథ్ ఆరోగ్యం క్షీణించి ఆస్పత్రుపాలపాలై ఇంకో వ్యక్తి సహకారంలో వచ్చాడు. దీంతో డిప్రెషన్‌లో ఉండి మతిస్థితం కోల్పోయాడు. దుబాయ్‌కి పంపించిన ఏజెంట్ ఇంతవరకు సాయినాధుని కలిసి జరిగిన నష్టాన్ని పూడ్చే ప్రయత్నం చేయకపోగా 75 వేల రూపాయలు కట్టాల్సిందే అని కుటుంబ సభ్యులపై ఒత్తిడి చేస్తున్నాడు. పొలం కాగితాలు గుంజుకొని బ్లాక్మెయిల్ చేస్తున్నాడు. సాయినాధుని ఆర్మూర్‌లోని హాస్పిటల్‌లో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. మోసం చేసిన ఏజెంట్లపై చర్యలు తీసుకొని ఆర్మూర్ పోలీసులను కోరనున్నారు. కోటపాటివెంట వీఆర్ఎస్ నాయకులు కుంట గంగా మోహన్ రెడ్డి, నిర్మల్ డివిజన్ గల్ఫ్ కార్మిక నాయకులు చిన్న రాజేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్నేహ సొసైటీలో జన్మదిన వేడుకలు



కేక్‌కట్‌చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

లచ్చగౌడ్ సత్యమ్మ మేముల ట్రస్ట్ అంకాపూర్ ఆధ్వర్యంలో మేముల లింగాగౌడ్ జన్మదినం సందర్భంగా స్నేహ సొసైటీలో దివ్యాంగుల మధ్య పుట్టినరోజు వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ మేముల లింగ గౌడ్ చేసిన సేవలు మరువలేనివని, ఆయన అమెరికాలో స్థిరపడ్డాడని పేర్కొన్నారు. అక్కడి నుండి ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలను చేస్తున్నారని అన్నారు. కేక్ కట్ చేసి చాక్లెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా సభ్యులు వాసు గౌడ్, రమేష్ గౌడ్, సురేందర్ గౌడ్, సిద్దయ్య, మహేందర్ గౌడ్, నరేందర్ గౌడ్, వేణు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

20న తెలంగాణ విద్యాదినోత్సవం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు 20న తెలంగాణ విద్యాదినోత్సవం వేడుకలు ఉదయం 7:30 నుండి 8.45 నిమిషాల వరకు గ్రామ స్థాయిలో విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించాలని డిఇఓ ఎన్వి దుర్గాప్రసాద్ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. విద్యార్థుల తల్లి తండ్రులకు విద్యాప్రతులు పంపిణీ చేస్తారు. అనంతరం ప్రతీ పాఠశాల ఆవరణలో తల్లి తండ్రులను, స్కూలు మేనేజ్మెంట్ మెంబర్లను ప్రముఖులను ఆహ్వానించి జాతీయ జెండా ఆవిష్కరించాలని పేర్కొన్నారు. తరువాత గత పది సంవత్సరాలనుండి స్కూలుకు సంబంధించిన ప్రగతి, మన ఉరు మన బడి, మన ఊరు మన బస్తీ కింద నిర్వహించిన స్కూలు అభివృద్ధి కార్యక్రమాలు, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ద్వారా విద్యార్థులు సాధించిన నైపుణ్యం, సైన్స్ హాకధన్ నిర్వహణ, పాఠ్యపుస్తకాల పంపిణీ, నోట్ పుస్తకాల పంపిణీ, యూనిఫారమ్స్ పంపిణీ, 41 పాఠశాలల్లో మొదటి దశ రాగిజావ పంపిణీ, పాఠశాలల్లో రీడింగ్ కార్నర్స్, లైబ్రరీస్, డిజిటల్ క్లాస్ రూమ్స్ ప్రారంభిస్తారని తెలిపారు. విద్యార్థులతో పాఠశాల స్థాయి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. తదనంతరం జిల్లా స్థాయిలో పలు విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరించిన 10 ప్రధాన ఉపాధ్యాయులు, 15 ఉపాధ్యాయులకు, 05 స్కూలు మేనేజ్ మెంట్ మెంబెర్లు, ఐదుగురు తల్లితండ్రులకు, పాఠశాలల ప్రగతికి సహకరించిన ఇద్దరు దాతలకు, 10 టిఎల్ఎం ఉత్తమ ఉపాధ్యాయులకు, ప్రభుత్వ పాఠశాలల్లో 10 జీపిఏ సాధించిన 29 విద్యార్థులకు సన్మాన నిర్వహించనున్నట్టు తెలిపారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారుడిని సన్మానించిన ఎమ్మెల్యే

- పది వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేత



క్రీడాకారున్ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈనెల 23 నుండి 24 వరకు జపాన్ దేశంలోని కొచ్చి లో జరిగే ఏషియా జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన డిచ్ పల్లి మండలం లోని మిట్టపల్లి క్రీడాకారుడు గుండా వినయ్ ని రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆదివారం ఘనంగా సన్మానించి రవాణా ఖర్చులకోసం ఆర్థిక సహాయం పది వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ విజయం సాధించుకొని రావాలని అన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్, జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేష్ గౌడ్, జడ్పీటీసీ ఇందిరా లక్ష్మి నర్సయ్య పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.డిచ్ పల్లి మండలం లోని మిట్టపల్లి క్రీడాకారుడు గుండా వినయ్ ను ఆదివారం గ్రామంలో ఘనంగా సన్మానించారు.

రెండు లక్షల ఎల్‌ఓసి అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులవల్ల మెరుగైన చికిత్స పొందలేని ఓ వ్యక్తికి పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే, టీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి అండగా నిలిచారు. పట్టణానికి చెందిన డీఆర్ఆర్ శశాంక్ గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా మెరుగైన వైద్య చికిత్స కోసం ఆర్థిక సాయం అందించాలని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డిని ఆశ్రయించారు. వెంటనే ఆయన సీఎంఆర్ఎఫ్ అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువచ్చి రెండు లక్షల రూపాయల ఎల్ వో సీని మంజూరు చేయించారు. జీవన్ రెడ్డి ఆదివారం ఎల్ వో సీ చెక్కును అందజేశారు.

రజకులకు ఎల్లవేళలా అండగా ఉంటా

- బీఆర్ఎస్‌లో రజక జన సేవా సంఘం సభ్యుల చేరిక
- రెండు కోట్ల వ్యయంతో దోభీగాట్ల ఏర్పాటు
- ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తఆధ్వర్యంలో రజక జన సేవా సంఘం సభ్యులు 150 మంది బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆదివారం అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గణేష్ బిగాల వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రజకులు చెరువులకు వెళ్లి ఉతికి సంస్కృతి మారాలని అన్నారు. నిజామాబాద్ నగరంలో న్యాల్కల్ రోడ్లో రూ. రెండు కోట్లతో మాడ్రన్ ధోబిఘాట్లను నిర్మించడం జరుగుతుందని అన్నారు. త్వరలోనే భూమి పూజ పనులు చేపడతామని తెలిపారు. దోబీ ఘాట్‌లో మిషన్లతో పని చేసే విధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు.



గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంబీసీ కులాలకు బిసి గ్రాంట్ నుంచి ఒక కుటుంబానికి లక్ష రూపాయల సహాయం అందజేస్తున్నారని అన్నారు. అన్ని కుల సంఘాల వర్గాలకు ఎల్లప్పుడు తోడుగా ఉంటానని ఎలాంటి సమస్య అయినా పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, సత్య ప్రకాశ్, రజక జన సేవా సంఘం అధ్యక్షులు మాందారం సుదర్శన్, ప్రధాన కార్యదర్శి బగ్గలి అజయ్, ఉపాధ్యక్షులు మల్లెపూల గోపి, శేఖర్, జాయింట్ సెక్రెటరీ బగ్గలి కృష్ణ, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

టీయూలో అక్రమ నియామకాలపై విచారణ చేపట్టాలి

- పీడీఎస్‌యూ

నవతెలంగాణ-ఆర్మూర్

గత కొంతకాలంగా తెలంగాణ యూనివర్సిటీ లో జరుగుతున్న పరిణామాలపై వీసీ రవీందర్ గుప్తా అక్రమ నియమకాలపై విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా అధ్యక్షులు అనిల్ కుమార్ మాట్లాడుతూ గత కొంతకాలంగా తెలంగాణ యూనివర్సిటీ జరుగుతున్న పరిణామాలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. విజిలెన్స్, ఏసీబీ, దాడులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు లేకుండా నామమాత్రంగానే ఉన్నాయని తెలిపారు. ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగాలను చేపట్టారని పీడీఎస్‌యూగా ఉద్యమాలు చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఎగ్జామ్ సెంటం కోసం 50వేల రూపాయలు తీసుకుంటుండగా ఏసీబీ వాళ్ళు పట్టుకున్నారని తెలిపారు. జిల్లా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి జోక్యం చేసుకోవాలని, సీఎం కేసీఆర్, కేటీఆర్ తెలంగాణ యూనివర్సిటీని సందర్శించి తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధి కోసం 500 కోట్ల రూపాయలను మంజూరు చేయాలన్నారు. లేకుంటే



సమావేశంలో మాట్లాడుతూన్న నాయకులు

ముఖ్యమంత్రి జిల్లాకి వస్తే అడ్డుకునే పరిస్థితి తప్పదన్నారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షులు నవీన్, నాయకులు ఆకాశ్,రము తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర గుంతకు మరమ్మతులు

నవతెలంగాణ -నవీపేట్

మండల కేంద్రంలో గత కొన్ని నెలలుగా ప్రమాదకరంగా మారిన గుంతకు బిజెపి నాయకులు ఆదివారం మరమ్మత్తు చేపట్టారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో గల మిషన్ భగీరథ పైపులైనుకు మరమ్మత్తులు చేపట్టి నామమాత్రంగా పూడ్చారు. దీంతో మండల కేంద్రంలోని ప్రయాణికులతో పాటు బాసర, భైంసా దూర ప్రాంతాలకు వెళ్ళు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడమే కాక తరచూ ప్రమాదలకు గురయ్యారు.ఈ ప్రమాదపు గుంతను పూడ్చాలని సోషల్ మీడియాలో సైతం గత కొన్ని రోజులుగా ప్రజలు పాలకుల దృష్టికి తీసుకువచ్చిన మరమ్మత్తులు చేయడంతో నిర్లక్ష్యం వహించారు. దీంతో బిజెపి యువకులు డస్ట్ వేసి, నీటితో మరమ్మత్తులు చేపట్టడం పట్ల స్థానికంగా ప్రశంసలు వెల్లువేత్తుతున్నాయి.అధికార యంత్రాంగం పాలకుల నిర్లక్ష్యానికి ఇదే నిదర్శమని పలువురు చెప్పుకున్నారు. మరమ్మతులు చేపట్టిన వారిలో గణేష్, రాజేందర్ గౌడ్,రాము, భూషణ్, బాలగంగాధర్, కాంతం రెడ్డి, బండారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గుంతకు మరమ్మతులు చేస్తున్న యువకులు

ఇందూరు అన్నమయ్య నరసింహారెడ్డికి అభినందన సభ

నవతెలంగాణ మోపాల్

మండలంలోని నర్సింగ్‌పల్లి ఇందూరు తిరుమల ఆలయంలో జరిగిన హరినామ చింతన కార్యక్రమంలో శ్రీమాన్ నర్సింహ్మా రెడ్డికి అభినందన సభ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ప్రముఖ విశ్లేషకులు పమిడికాల్వ మధుసూదన్, విశిష్ట అతిథిగ ధర్పల్లి జెడ్పిటిసి మరియు ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యుడు బాజిరెడ్డి జగన్ గారు పాల్గొన్నారు. ఇందూరులో అన్నమయ్య మళ్లీ పుట్టాడని పమిడికాల్వ మధుసూదన్ అన్నారు. ఆనాడు అన్నమయ్య ఏడుకొండల వాడిపై ఏ ఆర్తితో కీర్తనలు రాసాడో ఆ ఆర్తి నర్సింహ్మా రెడ్డి కీర్తనలో కనబడుతుందని అన్నారు. ప్రతి కీర్తనలో ఆధ్యాత్మికతతో పాటు సమాజహితం కూడ ఉందని తెలిపారు. భవిష్యత్తులో నర్సింహ్మారెడ్డి జిల్లాకు గొప్ప ఆధ్యాత్మిక సంపదగా మారుతారని బాజిరెడ్డి జగన్ అన్నారు. ఆలయ ఆస్థాన గాయకులు నర్సింహ్మా రెడ్డి కీర్తనలు పాడగ ప్రముఖ సాహితీ వేత్తలు కాసర్ల నరేష్, చందన్ రావు, ఆరుట్ల శ్రీదేవి, సిని నటులు రవి, పంచరెడ్డి లక్ష్మణ్ కీర్తనలపై విశ్లేషణ చేశారు. ప్రముఖ వేణు గాన విధ్వాంసులు పాడుత తీయగ ఫేం యుగంధర్ తన మురళితో ఇందూరు అన్నమయ కీర్తనలను వాయించి ఆహుతులను వినోదపరిచారు. వర్ధమాన సంగీత దర్శకులు, గాయకులు విజయ్ ఐలేని తమ గానామృతంతో శ్రోతలకు వీనులవిందు పంచాడు. ఆలయ ఆస్థాన గాయకులు ఇందూరు అన్నమయ కీర్తనలను పాడారు. హరిదా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కాసర్ల నరేష్ రావు సభాధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీ రాములు, ఉప సర్పంచ్ రాజేశ్వర్, నరాల సుధాకర్, రవిందర్ యాదవ్, నర్సా రెడ్డి, ప్రసాద్, దేవేందర్, చందన్ రావు, పంచరెడ్డి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు



సన్మానంచేస్తున్న బాజిరెడ్డి జగన్, తదితరులు

యూనివర్సిటీకి బాలికల వసతి గృహం మంజూరు



ఒప్పంద పత్రాన్ని అందుకుంటున్న రిజిస్ట్రార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో జరిగిన సమావేశంలో తెలంగాణ యూనివర్సిటీ కీ ఒక బాలికల వసతి గృహం మంజూరైనట్లు తెలంగాణ రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ప్రకటించారని, తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యాదగిరి ఆదివారం తెలిపారు. ఈ వసతి గృహం గిరిజన పేద విద్యార్థులకు మాత్రమే అందుబాటులో ఉంటుందని వివంచారు. వసతి గృహాల నిర్మాణానికి సంబంధించిన తెలంగాణ యూనివర్సిటీ, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య ఒప్పందాలు జరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ, కమిషనర్, గిరిజన సంక్షేమ శాఖధికారి క్రిస్టియన్ జెడ్ చోంగ్తు, ఏఈ వినోద్ తో పాటు తదితరులు పాల్గొన్నారు. ఒప్పంద పత్రాలను గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, డాక్టర్ క్రిస్టినా జెడ్ చోంగ్తు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యాదగిరి స్వీకరించారు.

20న రక్తదాన శిబిరం

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని రాంచంద్రపల్లి గ్రామంలోని హెల్పింగ్ అండ్ అసోసియేషన్ అధ్వర్యంలో ఈ నెల 20న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు హెల్పింగ్ అండ్ అసోసియేషన్ అధ్యక్షులు తౌడ్ మహేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రక్తదాన చేయడానికి ఇప్పటి వరకు 30 మంది ముందుకు వచ్చారని, మంగళ వారానికి ఇది ఇంకా పెరుగుతుందని తెలిపారు. రక్తదాన శిబిరాన్ని వచ్చిన వారికి బోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం నిర్వహించే రక్తదాన శిబిరాల వల్ల దాదాపుగా ఒక 36 మంది ప్రాణాలు కాపాడడం జరిగిందనీ, 36 మంది వ్యక్తులకు అత్యవసర సమయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా రక్తం ఇప్పించడం జరిగిందన్నారు. అందులో యాక్సిడెంట్ అయిన వ్యక్తులు, గర్భవతులు, బ్లడ్ పర్సంటేజ్ తక్కువ ఉన్నవారు ఉన్నారని తెలియజేశారు. శిబిరంలో కోటపాటి నర్సింహ నాయుడు పాల్గొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో యుతు సభ్యులు పాల్గొన్నారు.



తౌడ్ మహేష్